https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

10 AM TO 1 PM

సంపుటి: 01 / సంచిక:30 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / మంగళవారం, సెప్టెంబర్ 15,2026

### మోదీతో ఫొటోకు 'తుఝే దేఖా తో'..

## పుతిన్‌తో 'చలే చలో'

**మలేషియా ప్రధాని బాలీవుడ్ ప్లేలిస్ట్ వైరల్..**



న్యూఢిల్లీ: ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15

భారతదేశ రాజధాని ఢిల్లీ వేదికగా ఇటీవల 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగిసింది. ఈ సమావేశానికి బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాల అగ్రనేతలు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా దేశాల ప్రతినిధులు తమ పర్యటనకు సంబంధించిన జ్ఞాపకాలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. అయితే మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం మాత్రం తన పోస్టులతో ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. భారత్ పర్యటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలకు ఆయన ఎంచుకున్న బాలీవుడ్ పాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆయా సందర్భాలకు తగ్గట్టుగా పాటలను ఎంచుకోవడంపై నెటిజన్లు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత్ మండపానికి తనకు స్వాగతం పలికిన భారత ప్రధాని నరేంద్ర మోదీ వీడియోను మలేషియా ప్రధాని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఈ వీడియోకు షారుక్ ఖాన్, కాజోల్ జంటగా నటించిన 'దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే' సినిమాలోని 'తుఝే దేఖా తో యే జానా సనం' పాటను జత చేశారు. మోదీతో కలిసి ఉన్న మరో ఫొటోనూ ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. దీనికి షారుక్ ఖాన్, మాధురీ దీక్షిత్, కరిష్మా కపూర్ నటించిన 'దిల్ తో పాగల్ హై' సినిమాలోని 'దిల్ తో పాగల్ హై' పాటను ఎంచుకున్నారు.అలాగే, బ్రిక్స్ సదస్సులో ప్రసంగిస్తున్న తన ఫొటోలకు కూడా బాలీవుడ్ పాటనే అన్వర్ ఇబ్రహీం జత చేశారు. సల్మాన్ ఖాన్, రాణి ముఖర్జీ, ప్రీతి జింటా నటించిన 2000 నాటి 'హర్ దిల్ జో ప్యార్ కరేగా' సినిమాలోని అదే పేరుతో ఉన్న 'హర్ దిల్ జో ప్యార్ కరేగా' పాటను ఉపయోగించారు. భారత్ నుంచి తిరుగు ప్రయాణానికి సంబంధించిన షార్ట్ వీడియోలకు 'లక్ష్య' సినిమాలోని 'కంధోం సే మిల్తే హై కంధే' పాటను ఎంచుకున్నారు. ఈ రెండు పాటలు కలిసికట్టుగా ముందుకు సాగాలనే సందేశాన్ని అందిస్తాయి.భారత్ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను కూడా అన్వర్ ఇబ్రహీం కలిశారు.

# భారాస కు బిగ్ షాక్!



- భూదోపిడీపై సీఎం రేవంత్ రెడ్డి బిగ్ ప్లాన్
- నేడు ఏంహెచ్ఆర్డీ లో 22 ఏపై
- మంత్రులతో కీలక సమావేశం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 15;

గత భారాస ప్రభుత్వం ధరణి పేరుతో చేసిన భూ దోపిడీ ని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వెల్లడించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చ నీయాంశమైంది. ధరణి భూ దోపిడీ అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామంటూ సీఎం రేవంత్ ముందుగానే ప్రకటించారు. దమ్ముంటే అసెంబ్లీకి రావాలని, చర్చలో పాల్గొనాలని కూడా ప్రధాన ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సవాలు విసిరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి నట్లుగానే శనివారం 22 ఏ అంశంపై స్వల్పకాలిక చర్చ నిర్వహించింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు ఉదాహరణలతో భారాస హయాంలో జరిగిన ధరణి ల్యాండ్ స్కామ్ పై వివరణ ఇచ్చారు. సహచర మంత్రులు సహా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఈ వివరణపై సంతృప్తి వ్యక్తం చేశారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ సహా ఆ పార్టీ ఎమ్మెల్యేలు సైతం ఈ చర్చలో పాల్గొని ప్రభుత్వ వివరణ పట్ల పరోక్షంగా సమ్మతి తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి నేడు (మంగళవారం) ఏంహెచ్ఆర్డీ లో కీలక సమావేశం నిర్వహించనున్నారు. మంత్రి పొంగులేటి వెల్లడించిన భూ దోపిడీపై సమగ్రమైన దర్యాప్తు నిర్వహించేలా సంచలన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని విశ్వాసనీయ వర్గాల సమాచారం.

**భారాస కు ఉహించని షాక్!**

నిషేధిత భూముల జాబితాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై గత కొన్ని వారాలుగా భారాస దుమ్మెత్తి పోస్తున్నది. ఈ నేపథ్యంలో ఆ పార్టీకి ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించింది. ధరణి అమల్లో ఉన్న కాలం సహా భారాస హయాంలో జరిగిన మొత్తం భూ లావాదేవీలపై సమగ్ర దర్యాపుజరిపించేలా మంత్రులతో జరిగే సమావేశంలో సీఎం నిర్ణయం తీసుకునే అవకాశముంది. 22-ఏ వ్యవహారంపై మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి క్షుణ్ణంగా చర్చించనున్నారు. శాసనసభ తిరిగి బుధవారం సమావేశం కానున్నందున 22- ఏ అంశంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించి భారాస కు చేసిన అక్రమాలు బహిర్గతం చేసే అవకాశాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నేడే మంత్రులతో జరిగే సమావేశంలో తీసుకునే నిర్ణయాన్ని బుధవారం అసెంబ్లీ వేదికగానే సీఎం ప్రకటించే అవకాశముంది.. దర్యాప్తు విషయమై ముఖ్యమంత్రి ప్రకటన చేసిన తర్వాత భారాస లీడర్లలో ఎవరి మెడకు ఏం చుట్టుకుంటుందనేది ఆసక్తికరంగా మారి తెలంగాణ భవన్ 22-ఏ బాధితుల కోసం ప్రత్యేకంగా హెల్ప్ లైన్, గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసిన నేపథ్యంలోఆ పార్టీని కోలుకోలేని దెబ్బతీసేలా సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ స్ట్రాటెజీ రూపొందించ బోతున్నట్లు విశ్వాసనీయ వర్గాల సమాచారం.

# నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు: కేటీఆర్



- సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగులు
- ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్
- పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్
- రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని మండిపాటు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15

హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

### అమిత్ షా యూసీసీ ప్రకటనపై

## ఆచితూచి స్పందిస్తున్న మిత్రపక్షాలు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15



ఎన్డీఏ భాగస్వామ్య ప్రభుత్వాలున్న 21 రాష్ట్రాల్లో ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫాం సివిల్ కోడ్-యూసీసీ)ని అమలు చేస్తామన్న కేంద్రమంత్రి అమిత్ షా ప్రకటనపై ఆ కూటమికి చెందిన మూడు పార్టీలు ఆచితూచి స్పందిస్తున్నట్టు తెలుస్తోంది. తెలుగు దేశం, జనతా దళ్(యూ), లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పార్టీలు యూసీసీ ప్రకటన అనంతరం ఆలోచనలో పడినట్టు సమాచారం.ఇప్పటివరకు తాము ఉమ్మడి పౌర స్మృతిపై ఎలాంటి చర్చ జరపలేదని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. అవసరమైనప్పుడు దానిని పరిశీలిస్తామని ఆయన వివరించారు. మరోవైపు జనతా దళ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా స్పందిస్తూ.. యూసీసీ అమలుకు ముందు అమిత్ షాను కలిసి చర్చిస్తానని పేర్కొన్నారు. ఆ పార్టీ చీఫ్ నితీశ్ కుమార్ గతంలో ఉమ్మడి పౌర స్మృతి విధానానికి మద్దతిచ్చారు. అయితే అన్ని వర్గాలతో చర్చించాకే దాన్ని అమలు చేయాలని చెప్పారు. అలాగే లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. వివిధ వర్గాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, సమగ్ర చర్చలు జరిపాకే యూసీసీపై తమ వైఖరిని వెల్లడిస్తామని తెలిపారు.తాజాగా ఓ ప్రెస్‌మీట్‌లో 2029 ఎన్నికలకు ముందే ఎన్డీఏ పాలిత 21 రాష్ట్రాల్లో ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామని అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు యూసీసీ గుజరాత్, అస్సాం, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అమలవుతోంది.

### ఎం.ఎస్. సుబ్బులక్ష్మి


## బయోపిక్ గ్రాండ్ లాంచ్..

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15

భారతీయ సంగీత ప్రపంచంలో చెరగని ముద్ర వేసిన గాన సరస్వతి, భారతరత్న ఎం.ఎస్. సుబ్బులక్ష్మి అమ్మ జీవితం వెండితెరపైకి రానుంది. ఆమె జీవిత కథ ఆధారంగా 'ఎం.ఎస్.సుబ్బులక్ష్మి అమ్మ' పేరుతో ఈ బయోపిక్ రూపొందనుంది. ఈ ప్రాజెక్ట్‌పై మంగళవారం అధికారిక ప్రకటన విడుదలైంది. ఇందులో సుబ్బులక్ష్మి పాత్రలో రష్మిక నటించనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. గీతా ఆర్ట్స్, రాక్‌లైన్ ఎంటర్‌టైన్‌మెంట్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై అల్లు అరవింద్, రాక్‌లైన్ వెంకటేష్, బన్నీ వాసు కలిసి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందించనుండటం మరో ప్రత్యేకత.ఎం.ఎస్. సుబ్బులక్ష్మి అమ్మ 110వ జయంతిని పురస్కరించుకుని ఈ సినిమాను అధికారికంగా లాంచ్ చేయనున్నారు. ఈ నెల 16న చెన్నైలోని 'ది మ్యూజిక్ అకాడమీ'లో సాయంత్రం 6 గంటలకు ఈ వేడుక ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి విశ్వ నాయకుడు కమల్ హాసన్ హాజరుకానున్నారు. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి ఆలపించిన చిరస్మరణీయ గీతాలను 'ది ఇండియన్ కోరల్ ఎన్‌సెంబుల్' ప్రత్యేకంగా ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వినిపించనుంది. సంగీత ప్రపంచంలో ఓ ప్రత్యేక శకానికి ప్రతీకగా నిలిచిన ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవితాన్ని రష్మిక ఎలా ఆవిష్కరించనున్నారు? గౌతమ్ తిన్ననూరి ఈ కథను ఎలాంటి దృక్కోణంలో తెరకెక్కించనున్నారు? అన్నది ఆసక్తికరంగా మారింది. వరల్డ్ క్లాస్ మేకింగ్, హై టెక్నికల్ వ్యాల్యూస్ తో ఈ సినిమా త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.



# అంతరిక్షంలో మా వద్ద ఆయుధాలున్నాయ్..
## తొలిసారి అమెరికా బహిరంగ ప్రకటన..!



త్రినెట్ న్యూస్, సెప్టెంబరు15

అంతరిక్షం లో తమ వద్ద ఆయుధాలు ఉన్నాయని అమెరికా తొలిసారి బహిరంగంగా ప్రకటించింది. ఇప్పటికే కొన్ని 'స్పేస్ కంట్రోల్ వెపన్స్ ' కక్ష్యలో ఉన్నాయని అమెరికా స్పేస్ ఫోర్స్ వెల్లడించింది. శత్రు దేశాల దాడుల నుంచి అమెరికా, మిత్రదేశాల బలగాలను రక్షించేందుకే వీటిని మోహరించినట్లు తెలిపింది. అయితే ఆయుధాల సంఖ్య, వాటి స్థానం, ఏ తరహా వ్యవస్థలను ఉపయోగిస్తున్నారన్న వివరాలను మాత్రం బయటపెట్టలేదు. అమెరికా ఎయిర్‌ఫోర్స్ కార్యదర్శి ట్రాయ్ మెయింక్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అమెరికా సాయుధ బలగాలపై శత్రు దేశాల నుంచి ఎదురయ్యే ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాలను మరింత పెంచుతున్నామని చెప్పారు. ప్రస్తుతం కక్ష్యలోనే శత్రు చర్యలను ఎదుర్కోగల అంతరిక్ష ఆయుధాలు ఉన్నాయని స్పష్టంచేశారు. ఈ ఆయుధాలు 'కైనెటిక్, నాన్-కైనెటిక్' విధానాల్లో పనిచేయగలవని స్పేస్ ఫోర్స్ తెలిపింది. అవసరాన్ని బట్టి రక్షణతోపాటు దాడి చర్యల్లోనూ వీటిని ఉపయోగించవచ్చని పేర్కొన్నది. అయితే అవి ఉపగ్రహాలను ధ్వంసం చేసే ఆయుధాలా, ఇతర రకాల వ్యవస్థలా అన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు. అంతరిక్ష రంగంలో చైనా, రష్యాల నుంచి ముప్పు పెరుగుతోందని అమెరికా భావిస్తోంది. ఉపగ్రహాలు సైనిక కమ్యూనికేషన్లు, నిఘా, నావిగేషన్‌కు కీలకం కావడంతో వాటిపై ఆధిపత్యం భవిష్యత్ యుద్ధాల్లో కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో అమెరికా తొలిసారి కక్ష్యలో ఆయుధాల ఉనికిని బహిరంగంగా అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 1967 నాటి ఔటర్ స్పేస్ ట్రీటీ అంతరిక్షంలో సామూహిక విధ్వంసక ఆయుధాల మోహరింపును నిషేధిస్తుంది.

# యూపీఐ, రూపే పేమెంట్లపై అర్ధరాత్రి గెజిట్ విడుదల చేసిన కేంద్రం

న్యూ ఢిల్లీ, త్రినెట్ న్యూస్, సెప్టెంబరు 15:




దేశంలో డిజిటల్ చెల్లింపులపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాన్ని తీసుకుంది. రూ. 2,000 వరకు జరిపే యూపీఐ, రూపే డెబిట్ కార్డ్ లావాదేవీలపై తన వైఖరిని తేటతెల్లం చేసింది రూ. 2,000, అంతకు మించిన మొత్తంపై అదనపు ఛార్జీలను విధించే విషయంపై తీసుకున్న నిర్ణయం కావడం వల్ల దీనికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ మేరకు అర్ధరాత్రి కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఓ గెజిట్ విడుదల చేసింది. బ్యాంకులు లేదా పేటీఎం, ఫోన్ పే, గూగుల్ పే వంటి.. పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు రూ. 2,000 రూపాయలు, అంతకుమించిన మొత్తంతో జరిపే లావాదేవీలపై ఎలాంటి అదనపు చార్జీలు విధించకూడదని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్ కింద లభించిన అధికారాలను ఉపయోగించి ఈ ఉత్తర్వులు జారీ చేసింది. డిజిటల్ పేమెంట్ ద్వారా రోజువారీ కొనుగోళ్లు నిర్వహించే సామాన్య ప్రజలు, చిన్న తరహా వ్యాపారులకు ఈ నిర్ణయం ఎంతో ఊరట కలిగినట్టయింది. ప్రస్తుతం యూపీఐ, రూపే ద్వారా జరిగే ఈ డిజిటల్ లావాదేవీల నిర్వహణ వ్యయాన్ని బ్యాంకులు, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్, పేమెంట్ కంపెనీలే భరిస్తూ వస్తోన్నాయి. ఇకపై వీటిని యూజర్లకు బదలాయిస్తారంటూ కొన్ని రోజులుగా వార్తలు వెలుడుతున్న విషయం తెలిసిందే. కేంద్రం సైతం వీటిపై లీకులు ఇచ్చింది ఇదివరకు. దీంతో డిజిటల్ పేమెంట్ చెల్లింపుదారుల్లో ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. తాజా గెజిట్ విడుదలతో.. వాటన్నింటికీ తెరదించింది కేంద్రం.

# ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ..
## 20 మందికి తీవ్ర గాయాలు..

త్రినెట్ న్యూస్, సెప్టెంబరు15

ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన ఘటన హైదరాబాద్ శివార్లలోని హయత్‌నగర్ ఏరియాలో జరిగింది. హయత్‌నగర్ ఏరియాలోని కుంట్లూరు సమీపంలో ఈ ప్రమదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్‌తో సీఎం రేవంత్ భేటీ
## మూసీపై కీలక చర్చలు



హైదరాబాద్, త్రినెట్ న్యూస్, సెప్టెంబరు15

అగా ఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(మంగళవారం) తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్-ఎతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. 'మా వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో అగా ఖాన్ ఫౌండేషన్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది. అగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో ఇటీవలే మా శాసనమండలి భవనాన్ని పునరు ద్ధరించుకున్నాం. అగా ఖాన్ ఫౌండేషన్ కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించింది' అని తెలిపారు. మూసీ నది పునరుజ్జీవం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో అగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని సీఎం అన్నారు. ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా తీర్చిదిద్దాలని భావిస్తున్నామని చెప్పారు. మూసీ నదిని నైట్ ఎకానమీ కోసం తీర్చిదిద్దుతామని వెల్లడించారు. తప్పకుండా గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్-ఎను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 100కు పైగా దేశాల ప్రతినిధులు ఈ సమ్మిట్‌కు హాజరవుతారన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని.. నెట్-జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ ఉండబోతుందని అన్నారు. ఎయిర్‌పోర్టుకు 20 నిమిషాల దూరంలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు. సింగపూర్‌కు చెందిన కంపెనీ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తోందని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ లాంటి సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# మోదీతో ఫొటోకు 'తుఝే దేఖా తో'..
## పుతిన్‌తో 'చలే చలో'

వారితో కలిసి భోజనం చేస్తున్న ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్న ఆయన.. వాటికి షారుక్ ఖాన్, ప్రీతి జింటా నటించిన 'వీర్-జారా' సినిమాలోని 'ఐసా దేశ్ హై మేరా' పాటను జత చేశారు. భారతదేశంలోని భిన్న సంస్కృతులు, వైవిధ్యాన్ని చాటే ఈ పాటను ఆ సందర్భానికి అనుగుణంగా మలేషియా ప్రధాని ఎంచుకున్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో సమావేశమైన సందర్భంలో అన్వర్ ఇబ్రహీం చేసిన పోస్ట్ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఈ ఫొటోకు 1957లో వచ్చిన 'నయా దౌర్' సినిమాలోని 'సాథీ హాత్ బఢానా' పాటను ఎంచుకున్నారు. కలిసికట్టుగా చేతులు కలిపి ముందుకు సాగాలనే సందేశాన్ని ఈ పాట అందిస్తుంది. దీంతో ఇరాన్ ప్రతినిధులతో భేటీకి ఈ పాటను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కలిసి దిగిన ఫొటోకూ అన్వర్ ఇబ్రహీం ఓ బాలీవుడ్ పాటను జత చేశారు. అమీర్ ఖాన్ నటించిన 2001 చిత్రం 'లగాన్'లోని 'చలే చలో' పాటను ఎంచుకున్నారు. కలిసి ముందుకు సాగాలనే భావాన్ని ప్రతిబింబించే ఈ పాట.. పుతిన్‌తో భేటీకి ప్రత్యేక అర్థాన్ని తీసుకొచ్చింది. అయితే బాలీవుడ్ సంగీతాన్ని దౌత్య సందేశాలకు ఉపయోగించుకున్న నేత అన్వర్ ఇబ్రహీం ఒక్కరే కాదు. ఇండోనేషియా విదేశాంగ మంత్రి సుగియోనో కూడా ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో.. భారత్ పర్యటన సందర్భంగా 'దిల్ ధడక్‌నే దో' సినిమాలోని బాలీవుడ్ సంగీతాన్ని ఉపయోగించారు. దీంతో బ్రిక్స్ సదస్సు సందర్భంగా రాజకీయాలు, దౌత్యానికి తోడు బాలీవుడ్ పాటలూ సోషల్ మీడియాలో ప్రత్యేక చర్చకు దారితీశాయి. కాగా, ఈ శిఖరాగ్ర సమావేశానికి బ్రిక్స్ సభ్య దేశాల నుంచి 11 బృందాలు వచ్చాయి. అలాగే భాగస్వామ్య దేశాల నుంచి 10, ప్రాంతీయ సంస్థల నుంచి నాలుగు, అంతర్జాతీయ సంస్థల నుంచి ఏడు సహా మొత్తం 32 ప్రతినిధి బృందాలు పాల్గొన్నాయి.

# డొనాల్డ్ ట్రంప్ మా గ్యారెంటీ స్కీమ్స్‌ను కాపీ కొడుతున్నారు: డీకే శివకుమార్..



బెంగళూరు: త్రినెట్ న్యూస్, సెప్టెంబరు15

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు ప్రజల్లో మంచి ఆదరణ పొందాయని సీఎం పేర్కొన్నారు. ఇప్పుడు ట్రంప్ కూడా కాంగ్రెస్ హామీలనే కాపీ కొడుతున్నారని అన్నారు. తమ ప్రభుత్వ సంక్షేమ పథకాలు 'బ్లాక్‌బస్టర్' అయ్యాయని శివకుమార్ వ్యాఖ్యానించారు. బెంగళూరులో ఇవాళ (మంగళవారం) డీకే శివకుమార్ మాట్లాడుతూ.. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలతో ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని అన్నారు. ఇదే సమయంలో అమెరికా రాజకీయాల్లో ట్రంప్ తాజాగా చేసిన ఓ హామీని ఆయన ప్రస్తావించారు. నవంబర్‌లో జరిగే మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్లు ప్రతినిధుల సభ, సెనెట్‌పై ఆధిపత్యాన్ని కొనసాగిస్తే.. ప్రతి వయోజన అమెరికన్‌కు 5,000 డాలర్ల చొప్పున 'డివిడెండ్' అందిస్తామని ట్రంప్ ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. దీంతో కాంగ్రెస్ హామీలను ఆయన కాపీ కొడుతున్నారని శివకుమార్ చెప్పుకొచ్చారు. కాగా, ఐర్లాండ్‌లో గత ఆదివారం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రిపబ్లికన్లు గెలిస్తే ప్రతి వయోజనుడికి 5,000 డాలర్లు ఇవ్వడం సాధ్యమేనని చెప్పారు. అమెరికా ప్రభుత్వం భారీ మొత్తంలో ఆదాయం సమీకరిస్తోందని, అందువల్ల ఈ డబ్బు చెల్లింపు పెద్ద సమస్య కాదని అన్నారు. గతంలో డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ సమావేశంలో ట్రంప్ తొలిసారి ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాలోకి భారీగా ఆదాయం వస్తోందని, దీంతో ప్రజలకు 5,000 డాలర్లు చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు.

## వెయ్యి రోజుల పాలనపై సమాధానం చెప్పలేక మాపై దాడులు చేస్తారా?..
# రేవంత్ సర్కార్‌పై
# కేటీఆర్ ధ్వజం



ఢిల్లీ, త్రినెట్ న్యూస్, సెప్టెంబరు15

**వెయ్యి రోజుల తర్వాత తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తమపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ దాడులకు తెగబడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (ఖు=) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం ప్రాణాలను కూడా లెక్క చేయకుండా పోరాడిన నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ ఇంటిపైన దాడి చేస్తారా.? అని ఆగ్రహించారు. ఈరోజు (మంగళవారం) ఢిల్లీలో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. ఆ తర్వాత ఈ దాడిని ఆపాలని పోలీస్ స్టేషన్‌కు వెళ్తే తమపై కూడా దాడి చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. నిన్న మళ్లీ సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లోపల తన పీఆర్వో, పీఏలపై 15 మందితో దాడికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించిందని విమర్శించారు.**

### ఆ దాడికి ప్రయత్నించింది గుండాలా?, పోలీసులా?..

నిన్న పోలీస్ స్టేషన్‌లో దాడికి ప్రయత్నించింది గుండాలా?, పోలీసులా?, మఫ్టీలో వచ్చి దాడి చేసిన వారు ఎవరో తేలాలి? అని కేటీఆర్ డిమాండ్ చేశారు. తమ వారిపై జరిగిన దాడిపైన ఎఫ్ఐఆర్ నమోదు చేయమంటే కూడా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణలో పోలీస్ శాఖ కాంగ్రెస్ కార్యకర్తల కంటే ఎక్కువగా పని చేస్తోందని విమర్శించారు. గుండాల మాదిరిగా పోలీస్ స్టేషన్‌లో దాడులకు తెగబడిన వారికి.. మద్దతు ఇచ్చిన వారిపై ఎఫ్ఐఆర్లు ఎందుకు నమోదు చేయట్లేదని ప్రశ్నించారు.

### ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేని ఘోరమైన పరిస్థితి..

తమ పార్టీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు దాడి చేసిన వారిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరిన పోలీసులు నమోదు చేయలేదని ధ్వజమెత్తారు. ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేని ఘోరమైన పరిస్థితి తెలంగాణలో ఉందని ఆగ్రహించారు. ఈ అంశంలో కోర్టులను ఆశ్రయిస్తామని... కోర్టుల్లో తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నానని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరాశ నిస్పృహాల్లో ఉందని.. అందుకే ప్రతిరోజు అటెన్షన్ డైవర్షన్‌కి పాల్పడుతోందని కేటీఆర్ విమర్శించారు.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136